"వెళ్ళనీయండి. మీకా అదృష్టం ఎలానూ లేదు కదా!"

"అది కాదమ్మా. కాకినాట్లో..." తిరుపతయ్య ఏదో చెప్పబోయాడు.

"ఉండండి. నేనింకా కాఫీ నీళ్ళయినా గొంతులో పోసుకోలేదు. స్నానం చెయ్యాలి. వంట చెయ్యాలి. పన్లోకి పోవాలి. ఇవాళ లేవటమే ఆలస్యమైపోయింది" అంటూ వంటింట్లోకి వెళ్ళి కాఫీ గ్లాసులో పోసుకుని రెండు గుక్కలు తాగి అలా గ్లాసుతోనే నడవలో కొచ్చింది. పాలగ్లాసు అలాగే ఉంది. తండ్రి ఎటో ఆలోచిస్తున్నాడు. అతన్ని చూస్తే జాలేసింది సుమతికి. అయినా తను ఆయన విషయంలో అశక్తురాలు.

"ఏమిటో చెప్పబోయారు. చెప్పండి" అంది.

తిరుపతయ్య ముఖం కాస్త ప్రసన్నంగా మారింది.

"కాకినాట్లో మంచి డాక్టరున్నాడట. వీర్రాజు వియ్యంకుడికీ నాలాగే..."

"చాలు. ఇక చెప్పకండి. కాకినాడ వెళ్తానంటారా?"

"వెళ్తే బాగుండుననిపిస్తోంది. అతగాడిదీ నా వయసే. అతనికి కుదిరింది నాకెందుకు కుదరదూ?"

"కుదరకపోవచ్చు. వేళకి మందు వేసుకోవడం, నియమాలూ, పథ్యాలు పాటించడం మనకి చాతకాదుగా. అయినా ఎలా వెళ్తారు? నాకు రావటానికి కుదరదు. ఈ మారు సెలవంటే యింట్లోనే వుండిపొమ్మంటారు మా డాక్టరుగారు"

తిరుపతయ్య ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు.

"పోనీ పక్కింటి చలపతిని అడిగి చూడనా" అన్నాడు కాస్సేపాగి.

"ఇప్పుడు ఆయన కూడా రాలేడు. పూర్వంలా కాదు. మాస్టర్లు ఏ వూరి బడిలో పనిచేస్తే ఆ వూళ్ళోనే కాపురం ఉండాలట. అతనా వూరు వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు" అంటూ లోపలికెళ్ళి కూరల బుట్ట ముందేసుకుంది. 'ఈయనకి రాన్రాను చాదస్తం పెరిగిపోయింది. తనకు తోచిందే గాని ఒకరి మాట వినరు' – తనలో తానే విసుక్కుంది.

"వీరయ్యని రమ్మన్నా – వస్తాడు. నేనంటే గౌరవమున్న మనిషే. కాని ఛార్జీలు పెట్టి తీసుకెళ్ళకపోతే బావుండదు" అంటూ తిరుపతయ్య అక్కడికే వచ్చాడు.

"ఛార్జీలూ, డాక్టరు ఫీజులూ, ఇతర ఖర్చులు ... ఎలా లేదన్నా నాలుగొందలవుతుంది. ఆలోచించేరా" అంటూ మరో మాటకు తావియ్యకుండా లేచి పెరట్లోకి వెళ్ళిపోయింది సుమతి.

తిరువతయ్య ఇక మాట్లాడ్డానికి ప్రయత్నించలేదు. లేచి వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు.

సుమతి స్నానం చేసి వచ్చి దేవుడు దగ్గర దీపం పెట్టి వంట కానిచ్చింది. అప్పటికి టైం ఎనిమిదిన్నర దాటింది. టిఫిన్ బాక్స్ సర్దుకుని చీర మార్చుకుని యివతలి కొచ్చింది.

తిరుపతయ్య వీధి గడపలో గోడ కానుకుని కూర్చుని వున్నాడు.

"వేన్నీళ్ళు పెరట్లో గిన్నెతో పెట్టేను. చల్లారిపోతాయి. స్నానం చేసేయండి" అంది.

"అలాగే" అన్నాడు తిరుపతయ్య నెమ్మదిగా. కానీ లేవలేదు.

